



# గాలి మేడలు

''ఏమండీ పక్కింటి దశరథరామయ్యగారికి కేన్సరట పాపం'' అన్నది శాంత.

ఉలిక్కిపడ్డాడు నాగిరెడ్డి.

''ఎవరు చెప్పారు నీకు?'' అడిగాడు భార్యని.

''వాళ్ల పనిమనిషి గంగ చెప్పింది''

నాగిరెడ్డి హడావుడిగా పక్కింటికి వెళ్లాడు. తలుపులు తీసే ఉన్నాయి. పనిమనిషి వంటగదిలో ఉంది. దశరథరామయ్య బెడ్‌రూమ్‌లో పడుకుని ఉన్నాడు.

''ఏమోయ్! నేను విన్నది నిజమేనా?'' అంటూ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి బెడ్‌పక్కన కుర్చీలో కూర్చున్నాడు నాగిరెడ్డి.

''ఏం విన్నావేం?'' అంటూ లేవబోయాడు దశరథరామయ్య.

''మీ పనిమనిషి మా ఆవిడతో అన్నదట. నీకు కేన్సరనీ...''

''ఔనోయ్...''

''అయ్యో!'' అని విచారంగా కూర్చున్నాడు.

''ఇందులో బాధపడడానికేముందోయ్ రెడ్డీ. మనకి దాదాపు డెబ్బై ఏళ్లు నిండుతున్నాయి. ఇంకెన్నాళ్లుంటాము చెప్పు? మనకంటే చిన్నవాళ్లు ఎందరు పోవడం లేదూ!'' అన్నాడు దశరథరామయ్య.

''ఔననుకో! కానీ ఎందరి చావులు చూస్తున్నా మరణం ఎప్పుడూ కొత్తదే. మనవరకు వస్తే భయంగానే ఉంటుంది''

''ఈ రోజుల్లో చావుకి భయపడకూడదు. బతకడానికే భయపడాలి. ఎప్పుడేం జరుగుతుందోనని భయం. బైట ఊళ్లల్లో ఉన్న పిల్లలు ఎలా ఉన్నారోనని బెంగ. ప్రపంచంలో ఏం ఉపద్రవం ముంచుకొస్తుందోనని భయం. బాంబు పేలుళ్లలో పోయినవారిని చూస్తే వణుకు. తుఫాన్‌లో కొట్టుకొచ్చిన శవాలని నీళ్లల్లో చూస్తే భయం''

''భలే చెప్తున్నావులే!''

''ఉన్నమాట అంటున్నానోయ్! మనిషి చావడానికి ఏదొక కారణం సృష్టిస్తాడు భగవంతుడు. అందులో ఈ కేన్సర్ ఒకటి'' అని పేలవంగా నవ్వాడు దశరథరామయ్య.

''అది సర్లే! ఎక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నావు?'' అడిగాడు నాగిరెడ్డి.

''లకిడీకా పూల్ దగ్గర కేన్సర్ హాస్పిటల్లో. రేడియో థెరపీనో ఏదో చేస్తున్నారు''

''గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్తున్నావా? ఏదైనా ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్లగూడదా? జూబ్లీహిల్స్‌లో నాకు తెలిసిన డాక్టర్ అక్కడ కేన్సర్ హాస్పిటల్లో పని చేస్తున్నాడు. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుందువుగానీ''

''ఆ.. ఎక్కడైతే ఏం లేవోయ్! నేను బతికేది కొన్ని నెలలు. అనవసరంగా డబ్బు తగలెయ్యడం తప్ప మరేం లేదు'' నిరాశతో అన్నాడు దశరథరామయ్య.

''అట్లా అంటావేం? ఈ రోజుల్లో అన్ని జబ్బులకూ మందులున్నాయి''

''ఉన్నాయిలేగానీ కేన్సర్‌కి కాదు''

ఇక దశరథరామయ్య తన మాట వినడని నాగిరెడ్డికి తెలిసిపోయింది.

''ఒంటరిగా ఇక్కడెందుకోయ్ నువ్వు. మీ ఆవిడ పోయి పదేళ్లయింది. అప్పట్నుంచి ఒంటరిగా పనిమనిషి మీద ఆధారపడి ఉంటున్నావు. సరే ఆరోగ్యం బాగున్నప్పుడు ఫర్వాలేదు. ఇప్పుడిక మీ వాడి దగ్గరికి వెళ్లిపోయి ఉంటే మంచిది కదా!'' సలహా చెప్పాడు నాగిరెడ్డి.

''నాకేమిటో ఆ బొంబాయిలో ఊపిరాడనట్లు ఉంటుంది. ఆ అద్దె కొంపలో చివరి రోజులు గడపడం ఎందుకు? హాయిగా సొంత ఇంట్లో కన్ను మూస్తాను'' చెప్పాడు దశరథరామయ్య.

కాసేపు కూర్చుని ఇంటికి వచ్చేశాడు నాగిరెడ్డి.

ooo

ఆ రోజు సాయంకాలం టీవీ ముందు కూర్చుని కళ్లు మూసుకుని ఉన్నాడు నాగిరెడ్డి.

శాంత 'టీ' కప్పు తెచ్చి టీపాయ్ మీద పెట్టి ''ఏంటండీ టీవీ చూస్తున్నారా? ఏదో ఆలోచిస్తున్నారా?'' అన్నది.

''టీవీ వింటూ ఆలోచిస్తున్నాను'' అని నవ్వాడు.

''ఏవిటో అంత ఆలోచన?''

''మన పక్కింటి దశరథరామయ్య ఎన్నాళ్లో బతికేట్లు లేడు''

''ఔను. మాయదారి జబ్బు వచ్చిందాయె పాపం. ముప్పై ఏళ్ల నుంచి ఇరుగుపొరుగు ఇళ్లల్లో ఉంటున్నాం. మన పిల్లలు కూడా వాళ్ల పిల్లల్తో అన్నదమ్ముల్లా పెరిగారు. పాపం ఆయన భార్య పోయి ఒంటరివాడైపోయాడు''

''అది సరేలే! అది కాదు నేను ఆలోచించేది?''

''మరింకేమిటి?''

''మన ఎం.ఐ.జి. మూడు వందల గజాలు. వాళ్ల యం.ఐ.జి. మూడు వందల గజాలు. రెండూ కలిపితే అపార్ట్‌మెంటు కట్టొచ్చు. ఏ బిల్డర్‌కి ఇచ్చినా ఫిఫ్టీ ఫిఫ్టీ కింద సగం ఫ్లాట్స్ ఇస్తాడు. మనకి పది ఫ్లాట్స్ వస్తాయి''

''బాగానే ఉంది సంబడం. గాలిమేడలు కడుతూ కూర్చోకండి. దశరథరామయ్య ఇల్లు మనకెందుకు ఇస్తాడు? ఆయన ఇచ్చినప్పుడు గదా మనం డెవలప్‌మెంటుకి ఇచ్చేది?''

''ఎటూ చావబోతున్నాడు. కొడుకు ఇక్కడ లేడు. రాడు. మనకి అమ్మమని అడుగుదాం. ముందే కొనేసి ఆయన ఉన్నంత కాలం ఉండమందాం. ఏమంటావు?''

''ఆయన చివరి రోజుల్లో సొంత ఇంట్లో ఉండడం తప్పదు. అడిగి చూడండి. ఏమంటాడో? మీకు ముప్పై ఏళ్ల నుంచి స్నేహం ఉంది గదా!'' అన్నది శాంత.

నాగిరెడ్డి రోజూ ఒకసారన్నా దశరథరామయ్య ఇంటికి వెళ్లి పలకరిస్తున్నాడు. రైతుబజారు దగ్గర చౌకగా కొన్నానని పళ్లు తీసుకెళ్లి ఇస్తున్నాడు.

ఒకరోజు తన మనసులో మాట బైట పెట్టాడు.



''నీ తర్వాత మీ వాడు బొంబాయి నుంచి వచ్చి ఇక్కడ ఉండబోడు కదోయ్! మహా అయితే అద్దెకి చ్చిపోతాడు. అద్దెలకిస్తే వాళ్లతో పేచీలు. నెలనెలా అద్దె వసూలు చేసుకోవడం కష్టం. కొందరైతే ఇల్లు ఖాళీ చెయ్యను పొమ్మని పేచీలకు దిగి కోర్టుకెక్కుతుంటారు''

ఇదంతా రెడ్డి తనకు ఎందుకు చెప్తున్నాడో అర్థం కానట్లు చూశాడు దశరథరామయ్య.

''ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే నాకొక ఐడియా వచ్చింది. మన ఈ క్వార్టర్లు కట్టి ముప్పై ఏళ్లు దాటిపోయాయి. హౌసింగ్ బోర్డు వాళ్లు నాసి రకంగా కట్టించారు. ఇళ్లు పాతవయిపోయాయి. వానాకాలం వస్తే ఇల్లంతా కారడమే. అందుకని పడ గొట్టి కొత్త బిల్డింగ్ కట్టించుకుంటే పది కాలాల పాటు ఉంటుంది. ఏమంటావు?''

''ఆ....ఆ జంజాటమంతా నాకెందుకోయ్ రెడ్డీ! నా తర్వాత మా వాడు వాడి తిప్పలేవో పడతాడు'' అన్నాడు దశరథరామయ్య.


''అందుకని నువ్వు భారమంతా మీ వాడి మీద వేసేస్తావా? పాపం వాడు బొంబాయిలో ఉంటున్నాడు. ఇక్కడకొచ్చి ఏం పట్టించుకుంటాడు? మనమే ఒకదారి చూపిస్తే మంచిది కదా?''

''సర్లేవోయ్ రెడ్డీ! నన్నేం చేయమంటావో చెప్పు? ఆ ఐడియా ఏదో మా వాడికి చెప్తాను''

''నా ఐడియా ఏముంది? అమ్మేయడమే! ఆ డబ్బు ఫిక్సడ్ డిపాజిట్ చేస్తే నీ మనుమలకు ఉపయోగపడుతుంది'' అన్నాడు నాగిరెడ్డి.

''నువ్వు చెప్పింది బాగానే ఉందోయ్! కానీ నాకు స్వంత ఇంట్లో చచ్చిపోవాలని ఉంది. నా తర్వాత ఎటూ మా వాడు అమ్ముకుంటాడు''

''నీకు అభ్యంతరం లేకపోతే ఈ ఇల్లు నాకే అమ్ము. నీ తదనంతరమే స్వాధీనం చేసుకుంటాను. నువ్వుండగానే ఐతే, ఇల్లు నీ పేరు మీద ఉంది కాబట్టి రిజిస్ట్రేషన్ ఈజీగా ఉంటుంది.




నీ తర్వాత మీ వాడు అమ్మాలంటే బోలెడు తతంగం ఉంటుంది. లీగల్ హెయిర్ సర్టిఫికెట్ కోసం నెలలు తరబడి తిరగాలి. అదంతా మీ వాడికి హెడేక్'' చెప్పాడు నాగిరెడ్డి.

''నువ్వన్నది నిజమే! మావాడు వస్తానని ఫోన్ చేశాడు. వాడు వచ్చినప్పుడు అన్నీ వివరంగా మాట్లాడదాం. నాకు గూడా ఈ ఇల్లు నీకు అమ్మడం మంచిదనే అనిపిస్తోంది. ఎందుకంటే మా వాడెప్పుడైనా ఇక్కడికొచ్చినప్పుడు ఇంట్లో ఉండడానికి వీలుంటుంది'' అన్నాడు దశ

రథరామయ్య.

''అంతే కదోయ్! మీ వాడికి మా ఇంట్లో ఎంత చనువు? ఎప్పుడొచ్చినా సొంత ఇంట్లో ఉన్నట్లు ఎన్నాళ్లయినా ఉండొచ్చు'' అన్నాడు నాగిరెడ్డి సంతోషపడిపోతూ.

ఇంటికెళ్లిన తర్వాత భార్యతో చెప్పాడు నాగిరెడ్డి.

''సమయం చూసి ఒక రాయి వేశాను. దశరథరామయ్య ఇల్లు మనకే అమ్మడానికి ఒప్పుకున్నాడు. బొంబాయి నుంచి కృష్ణ వస్తానన్నాడట. వాడు రాగానే రాతకోతలు పూర్తి చేయిస్తాను. ఇక వాడు తండ్రి మాట కాదనడు. దశరథరామయ్య చివరి రోజులు ఇంట్లోనే గడపమన్నాను. పోయాకే మనం స్వాధీనం చేసుకోవచ్చు. ఏమంటావు?''

''అయ్యో! అదే న్యాయం'' అన్నది శాంత.

ooo

ఆ రోజు ఉదయం దశరథరామయ్య కాలకృత్యాలు తీర్చుకుని హాల్లో కూర్చుని టీవీలో వార్తలు చూస్తున్నాడు. పనిమనిషి ఇంకా రాలేదు. రోజూ ఈపాటికి వచ్చేది. ఎందుకు రాలేదో? అనుకున్నాడు. ఎప్పుడైనా రాకపోతే ఫోన్ చేసి చెప్తుంది. అతను హోటల్‌నుంచి టిఫిన్, భోజనం తెప్పించుకుంటాడు.

ఇంతలో ఎక్కడ్నుంచో ఏడుపులు వినిపించాయి. రోడ్డు మీద ఎవరైనా ఏడుస్తున్నారేమో? అనుకున్నాడు. పనిమనిషి గంగ ''అయ్యగారూ! అయ్యగారూ!'' అంటూ హడావుడిగా లోపలకి వచ్చింది.

దశరథరామయ్య ఆమె వైపు చూశాడు. గంగ ఎందుకంత ఆందోళనతో ఉందో అతనికి అర్థం కాలేదు.

''నాగిరెడ్డిగారు పోయారంటండీ!'' అన్నది.

దశరథరామయ్య షాక్ తిన్నట్లయిపోయాడు.

''అదేంటి? ఉక్కుముక్కలా ఉండే నాగిరెడ్డి పోవడం ఏమిటి? ఏదైనా యాక్సిడెంట్ జరిగిందా?''

''ఏమైందిట?'' ఆశ్చర్యంతో అడిగాడు.

''తెల్లవారుజామున గుండెనొప్పి అన్నాడట. హాస్పిటల్‌కి తీసుకెళ్లారట. లోపలకి తీసుకెళ్లేసరికి పోయాడట. గుండె పోటట'' చెప్పింది గంగ.

దశరథరామయ్య కళ్లు మూసుకుని ట్రాన్స్‌లోకి వెళ్లిపోయాడు. తలంతా తిరుగుతున్నట్లయింది. కుర్చీలో నుంచి లేచి నిల్చున్నాడు.

''అయ్యగారూ! పరగడుపున అక్కడికి వెళ్లకండి. ఏదైనా టిఫిన్ తిన్న తర్వాత వెళ్దురుగానీ. మీకు వంట్లో బాగోలేదు గూడా!'' అని వంటింట్లోకి వెళ్లింది గంగ.

తర్వాత నెమ్మదిగా పక్కింటికి వెళ్లాడు. ఇంటి ముందు షామియానా వేసి ఉంది. కొన్ని కుర్చీలలో వచ్చిన వాళ్లు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. దశరథరామయ్యను చూడ్డంతోనే శాంత బావురుమని ఏడ్చింది.

''విధి రాత విచిత్రంగా ఉంటుందమ్మా! చావుకి దగ్గరిగా ఉన్న వాడిని నేను ఇలాగే ఉన్నాను. ఉక్కుముక్కలా ఉండే రెడ్డి పోయాడు. తను ఎప్పుడూ జ్వరున చీది ఎరగననీ, జీవితంలో జ్వరం రావడం ఏంటో తెలియదనీ గర్వంగా చెప్పేవాడు. ఏం చేస్తాం? బాధ పడకమ్మా! ఎవరైనా పోవాల్సిన వాళ్లమే. కొంచెం వెనుకా ముందు'' అని శాంతని ఓదార్చాడు దశరథరామయ్య.

నాగిరెడ్డి చనిపోయాడని తెలిసి బొంబాయి నుంచి దశరథరామయ్య కొడుకు కృష్ణమోహన్ పెద్దకర్మకి హాజరయ్యాడు. నాగిరెడ్డి కొడుకు మోహన్‌రెడ్డి అతనూ మంచి స్నేహితులు. చిన్నప్పటి నుంచి కలిసిమెలిసి పెరిగారు.

ఢిల్లీలో సెటిలైన మోహన్‌రెడ్డి తల్లిని తనతో పాటు తీసుకెళ్లాడు. ఆ ఇంటిని తన స్నేహితుడు కృష్ణమోహన్‌కి అమ్మేశాడు. కృష్ణమోహన్ బొంబాయి నుంచి హైదరాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. దశరథరామయ్యకు కేన్సర్ తొలి దశలో ఉందని ఆపరేషన్ చేశారు. ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాడు. ఇక ప్రాణ భయం లేదని డాక్టర్లు చెప్పారు. కృష్ణమోహన్ రెండు ఇళ్లు కలిపి ఒక బిల్డర్‌కి అపార్ట్‌మెంట్లు కట్టడానికి డెవలప్‌మెంట్‌కి ఇచ్చాడు.

'నాగిరెడ్డికి తన ఇల్లు ప్రాప్తం లేదు. అతడి ఇల్లు తమకి ప్రాప్తం ఉంది. విధి విచిత్రం' అనుకుంటూ ఉంటాడు దశరథరామయ్య అపార్ట్‌మెంటు వైపు చూస్తూ.

o



## 'ఇందిరాగాంధీ'గా మాధురి!

స్వర్గీయ ఇందిరాగాంధీ జీవితచరిత్రను సినిమాగా తీసేందుకు ఓ నిర్మాత సన్నాహాలు మొదలెట్టాడు. ఇందులో ప్రధాన పాత్ర అయిన ఇందిరా గాంధీగా మాధురీ దీక్షిత్ నటిస్తున్నట్టు బాలీవుడ్ వార్తలు చెబుతున్నాయి. రెండేళ్ల క్రితం హిందీ తెరపైకి రీఎంట్రీ అయిన మాధురికి అంతగా కలిసిరాలేదు. అయితే ఇప్పుడీ 'ఇందిరా గాంధీ' సినిమాతో తిరిగి వార్తల్లోకి వచ్చిందామె. వచ్చే ఏడాది నిర్మాణం జరుపుకునే ఈ సినిమా మాధురికి ఎంత పేరు తెస్తుందో వేచి చూడాలి!